# జాకెట్ రహస్యాలు

జాకెట్ రహస్యాలు రాకెట్ రహస్యాలకంటే గట్టివి. చంద్ర మండలం చుట్టూ తిరిగే అద్భుత సాహసికికూడా మనో మండలంలో సతతం సంతసం కలిగించేది పెళ్ళాం ముఖ చంద్ర బింబమేకదా! అంచేత గిరీశం "ఇటీజ్ విమెన్ దట్ సెడ్యూస్ ఆల్ మేన్ కైండ్" అని వాపోతాడు. జంగిల్స్‌లోకిపోయి ముక్కు మూసుగున్న (వై ముక్కు?) మునులుకూడా తామరస నేత్రలిండ్ల బందాలుకారె .... సంసార నౌక కంటెకూడా గట్టిది. "ఎంత, వారలైనా కాంతదాసులె" పొమ్మన్నాడు త్యాగరాజు, భూమి ఆకర్షణ శక్తినుంచి ఛేదించుకుని మగాడు పైకి ఎగరగల్డేమోకాని, మళ్ళీ చచ్చినట్టు ఆడదాని ఆకర్షణకు లొంగి కుక్కిన పేనులాగ భూమి మీదకు దిగిరావలసిందే? "చుట్టి చుట్టి పాతులెల్ల చెట్టు వెదకురీతి భువిని" ఎంతటి మొనగాళ్ళు సైతం రాకెట్ల బంధాల్నుండి విడివడ్డా జాకెట్ల బంధాల్నుంచి తప్పించుకు పారిపోలేరు. కొండమీద వెలసిన ది గ్రేట్ శ్రీనివాసుడు సైతం రోజూ కొత్తచెప్పులు తొడుక్కుని, ఏకాంత సేవలందుటకై కొండదిగి అమ్మవార్ని వెతుక్కుంటూ క్రిందకు రావలసిందేకదా! పెళ్ళాం మెళ్ళోని లాకెట్లో దాక్కోవడం రాకెట్లో పైకెళ్ళడం కంటె గొప్ప—తమతమ పెళ్ళాలకు జడిసి వాళ్ళు ఫామిలీ కక్ష్యకు (ఫామిలీ కక్షలు కావు) దూరంగా పోలేరు.

ఇల్లాళ్ళనువదిలేసి ఫామిలీకక్షలమూలంగా పారిపోయిన హీరోలు, సంసారం అంటే విరక్తి చెంది విరాగులుగా రంగు ఫిరాయించిన బాబాలు అయిదు రూపాయలకు ముక్తి మార్గాన్ని అప్లికేషన్ల వారీగా సీనియారిటీ కం శూటబిలిటీ ప్రకారం బోధించే బూడిద బుస్సన్నలూ, వీళ్ళంతా

''తామరస నేత్ర లిండ్ల బందాలు'' కాకుండా తప్పించుగున్న వారేనా అంటే కారేమో! భూమ్యాకర్షణను రాకెట్లు త్రెంచినట్లు ఆడదాని ఆకర్షణను త్రెంచడానికి మార్గం' లేదు. ముందు మెజారిటీ బేషరతుగా లొంగి పోవలిసిందే. తప్పించుకోటం మాట తరవాత సంగతి.

మొన్న తమ తమ భర్తలను అంతరిక్ష నౌకలో పైకి పంపించిన లేడీస్ ముగ్గురూ నిజంగా అపర సర్వమంగళలే. (మా వూళ్ళోనూ మొగుళ్ళను పైకి పంపించిన బ్రేవు లేడీస్ వున్నారు కాని వాళ్ల వాళ్ళెవ్వరూ తిరిగిరాలేదు.) మ్రింగెడివాడు విభుండని, మ్రింగెడిదియు గరళ మనియు, మ్రింగుమనె సర్వమంగళ మంగళసూత్రమ్ము నెంత మది నమ్మినదో — అన్నాడు పొయెట్ పోతన్నగారు, పై ముగ్గురు పతివ్రతలూ తమతమ మంగళసూత్రాల్ని ''అపోలో–8'' కి ముడేసి క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగి రమ్మన్నారు మొగుళ్ళను.

వాళ్ళండీ లేడీస్—

ఆ వారం రోజులూ వాళ్ళ గుండెలెలా టువ్వు టువ్వు మని కొట్టుకున్నాయో ఎవరైనా వూహించి చెప్పగల్రా? ఇదేవన్నా గుంటూరు బస్సెక్కడవా, అనాకాపిల్లి ప్రయాణవా, మైలెక్కడవా, రైలెక్కడవా? అలాటిలాటిది కాదే— ఏకా యెకి పై కెళ్ళిపోవడం, చంద్రుని దగ్గరకు. అప్పులుచేసి వూళ్ళోంచి పారిపోయేవాళ్ళు కూడా భూమ్యా కర్షణను, భామల ఆకర్షణను తప్పించుగోవాలనుకోరు. ఇటు స్త్రీ అటు డబ్బు ఆ పైన అధికారం ఈ మూడే గొప్ప ఆకర్షణలను కుంటే వీటినుంచి పారి పోయే మనస్తత్వంకంటే విజ్ఞానదాహంతో మనుష్యుడి గొప్పను బల్లగుద్ది అందరికంటె ముందుగా రుజువుపర్చడానికి ఆ ముగ్గురూ అపోలో-8లో పై కెళ్ళారు. దీనివల్ల తేలే రహస్యం ఏవంటే ''పైకి రావాలంటే పైకెళ్ళాలిగాని యింట్లో గుడిపావులా కూర్చోకూడదు, మగాడు తిరక్క—పోతే చెడతాడుకదా- అందుకనే అంతరిక్షంలో పైకెళ్ళి వాళ్ళు చంద్రుని చుట్టూ తిరగడం. తిరిగే రాకెట్టూ తిట్టే పత్రికా వూరుకోదు. మగాడు

డెవిలే— అడ్వెంచర్ వాడి మొహాన్న రాసుంది. "గోడలుదూకడం దగ్గ ర్నుంచి,' వెంకు పంతులుగారి కోడలికి లవ్ లెటర్ రాయడం వరకూ అడ్వెంచరే కదా!

కొందరుంటారు. వాళ్ళకు చేగోడీలు తింటూ మంచంవిరిగేలా నిద్రపోవడమే జీవితలక్ష్యం. "ధైర్యే సాహసేలక్ష్మి" యిలాటిమాటలు వాళ్ళ చెవికెక్కవు. ఒత్తి మంటిబుక్కడాలు వీళ్ళు — మెజారిటి జనులు వీళ్ళే. చంద్రుడెలా వుంటే మనకెందుకు? బూడిదరంగులో ప్లాస్టాఫ్ పారిస్‌లావున్నాడా-అది కనుక్కోడానికేనా పైకెళ్ళింది? అక్కడ నిశ్శబ్దంగా వుంటుందా — గాలి వుండదా — ఉష్ణోగ్రత రాత్రికీ పవలుకీ బ్రహ్మాండమైన వ్యత్యాసం వుంటుందా— చంద్రుడంటే బ్రహ్మాండమైన లోయలూ, కొండలూ, గోతులూనా.... ఈ మాత్రం తెలుసుకోవడానికి పొలో మంటూ పెళ్ళాం బిడ్డల్నొదిలిపించి ఆ అపోలో-8 లో పైకెళ్ళడం దేనికి? వీళ్ళంతా వీరులా? వీరులంటే ఇంట్లోవాళ్ళని ఏడిపించి మెప్పు కోసం పైవాళ్ళకి అడ్డమైన చాకిరీలుచేసేవాళ్ళనా అర్థం— మానవనాగరి కత చరిత్ర అంతా యిటువంటి సాహసాల్తో కూడుకొన్నట్టిదేనా ........ వ్యక్తులసాహసాలు చరిత్రలో సువర్ణాక్షరాలతో కంపోజ్‌చేస్తారట. మను ష్యుని కెప్పుడూ కొత్త అంటే వెర్రిసరదా- కొత్త ఆడదానికోసం వెర్రిగా ఎగబడ్డం అందుకేనేమో- మనుష్యుడి పెళ్ళానికి వున్నది వూడిపోకుండా అంటిపెట్టుకుని జీవించడంలోనేతృప్తి. ఆస్తికనిపెట్టినది ఆడది, అడ్వెం చర్ అంటే వాడికెంత యిష్టమో, వున్నదాన్ని పెంచి పోషించడమంటే 'దాని' కంత యిష్టం.

అప్పుడప్పుడు నాక్కూడా యీ డాం రొటీను నుంచి ఎక్కడికైనా ఎగిరిపోవాలనుంటుంది. మావారు "అపొలో ప్వెల్వ్"లో ప్రయాణం పెట్టుకున్నట్లు డాం బిజీగా వుంటారు. నాకేవీ తోచనపుడు సాహసాలు చెయ్యాలనిపిస్తుంది. కొత్త కొత్త లోకాలను అవలోకించాలనిపిస్తుంది. అప్పుడు నేను నడుపెక్కి కూర్చున్న నవారుమంచవే నా అంతరిక్షనౌక.

నా బుర్రలో చాలా స్క్రూలున్నాయి. ఆవి కొన్ని లూజ్‌చేస్తే అంటే మనసుని అలా గాలికి వదిలేస్తే (చంద్రమండలంలో గాలికూడా లేదట. గాలి పోగుచేసి అక్కడికి పంపించే బిజినెస్ ఒహటి పెట్టమని గవర్నమెంటాఫిండియాకో, అమెరికాకో లెటర్ ఒహటి రాయాలి) నోటికి వేరుశెనక్కాయలో, జీళ్ళో, తేగలో అందిస్తే.... నా మైండ్ ఏయే లోకాలకు వెళ్తుందో నే నిప్పుడు చెప్పలేను. మనోజవం మారుత తుల్యవేగం అన్నారు కదా- మైండుతో సందర్శించలేనిదంటూ వుండదు. మైండుం డబ్బేగదా మేటరూ--వుండండి సార్! జస్టె మినిట్.... మన దేహాల్ని కూడా అంతరిక్షనౌకలనవచ్చుకదా-- అవేకదా మనల్ని ఎప్పుడో ఒహప్పుడు అంతరిక్షానికి అంటే కైలాసవో, వైకుంఠవోతీసికెళ్ళేది. సంసారమనే ఈ అశాంతి సాగరంలోపడి కొట్టుకొంటున్న ఈ దేహాన్నివిడిచి జీవుడు అంతరిక్షంలోకి వెళ్ళడం సెంట్‌పరసెంట్ ఖాయంగనుక-అంతరిక్ష నౌక మనం ఎక్కలేదే అని ఎవరూ విచారించకండి.

కాని ఒకచిన్న కిటుకుంది.

మన అంతరిక్షనౌక మళ్ళీ భూమ్మీదకు తిరిగిరాదు. మన తర్వాత పడవ ఎక్కేవాళ్ళు మన్ని ఏట్లోకో కాట్లోకో తోస్తారు. అంతే- పేకిట్ ఈజీ!